

RNI: APTEL/2010/36742

న్యూస్ వార్

వార్తా పత్రిక

విలేకరులు కావలెను

తెలుగు భాషపై పట్టు స్థానిక సమస్యలపై అవగాహన కలిగిన ఉత్సాహవంతులైన
యువత యువకులకు జర్నలిస్ట్‌గా పనిచేసేందుకు సదావకాశం

న్యూస్ వార్ దిన పత్రిక

నూతన ఒరవడి ప్రత్యేక కథనాలతో మీ ముందుకు వస్తున్న న్యూస్‌వార్ దిన పత్రికలో ఆంధ్రప్రదేశ్, తెలంగాణ వ్యాప్తంగా అన్ని జిల్లాలు,నియోజకవర్గాలు, మండల కేంద్రాలల్లో వార్తాసేకరణకు విలేకరులు కావలెను ఆసక్తి కలవారు ఈ క్రింది నెంబర్‌ను సంప్రదించండి.

94409 91979

నల్లగొండ | epaper.news war.com | శుక్రవారం 5, జూన్ 2026 | సంపుటి :16 సంచిక :66 | ఎడిటర్: కృష్ణారావు నటవ | పేజీలు : 4 , వెల.2.00



## త్వరలో దీదీకి మరో షాక్?

పశ్చిమ బెంగాల్ అసెంబ్లీలో ఇటీవల కనిపించిన దృశ్యాలు పార్లమెంటులో కూడా పునరావృతం కానున్నాయా? టీఎంసీ ఎంపీలు కూడా తిరుగుబాటు బావుటా ఎగరవేయనున్నారా? అంటే అవుననే సమాధానం వినిపిస్తోంది. టీఎంసీకి చెందిన సుమారు 20 మంది ఎంపీలు తిరుగుబాటుకు సిద్ధంగా ఉన్నట్టు జాతీయ మీడియాలో కథనాలు వెలువడ్డాయి. ఇప్పటికే ఈ ఎంపీలు బీజేపీతో టచ్‌లో ఉన్నట్టు తెలుస్తోంది. ఈ విషయమై ఉన్నతస్థాయిలో చర్చలు కూడా జరుగుతున్నట్టు జాతీయ మీడియాలో కథనాలు వెలువడ్డాయి. తృణమూల్‌కు లోక్‌సభలో 28 మంది ఎంపీలు, రాజ్యసభలో 13 మంది ఎంపీలు ఉన్నారు.

2




## ఆ వీడియోతో వివాదం.. జూన్ 6 నిరసనపై పెరిగిన ఉత్కంఠ!

ఈ నెల 6న ఢిల్లీలోని జంతర్‌మంతర్ వద్ద నిర్వహించనున్న నిరసన కార్యక్రమానికి ముందు కాక్రోచ్ జనతా పార్టీ(జజపా)కి చెందిన ఓ వీడియో తీవ్ర దుమారం రేపుతోంది. సీజేపీకి మద్దతుదారుడిగా ఉన్న ఓ వ్యక్తి చేసిన వ్యాఖ్యలు.. సోషల్ మీడియాలో వైరల్ కావడంతో చర్చనీయాంశమైంది. ఈ వైరల్ వీడియోలో అమిత్ కుమార్ సింధ్ అనే వ్యక్తి నిరసనలో పాల్గొనే వారినుద్దేశించి మాట్లాడుతూ.. 'ఉద్యమ వ్యవస్థాపకుడు అభిజీత్ దీప్కేను విమానాశ్రయంలో ఇమ్మిగ్రేషన్ అధికారులు అడ్డుకుంటే అక్కడే అల్లర్లు చెలరేగుతాయి' అని చెప్పినట్టు తెలుస్తోంది.

2



## 17 ఏళ్లుగా నన్ను కోర్టుకు తీసుకెళ్లలేదు: లలిత్ మోదీ

ప్రపంచంలోనే రిచెస్ట్ స్పోర్ట్స్ లీగ్ అయిన ఐపీఎల్ వ్యవస్థాపకుడు, మాజీ ఛైర్మన్ లలిత్ మోదీ లండన్ నుంచి భారత్‌కు తిరిగి రావడంపై స్పందిస్తూ సంచలన వ్యాఖ్యలు చేశారు. ప్రస్తుతం తన ప్రాధాన్యతలు మారిపోయాయని, తాను భారత్‌కు తిరిగి వచ్చి తనను తాను నిరూపించుకోవాల్సిన అవసరం ఇక తనకు కనిపించడం లేదని స్పష్టం చేశారు. భారత్‌లో తనపై ఒక్క కేసు కూడా నమోదు కాలేదన్నారు. లండన్‌లో ఓ మీడియా నిర్వహించిన పాడ్‌కాస్ట్‌లో పాల్గొన్న లలిత్ మోదీ పలు విషయాలను వెల్లడించారు.

2

# తెలంగాణ ఉద్యమకారులందరికీ న్యాయం చేస్తాం



- విద్యార్థులు, ఉద్యమకారుల సంఘాలను మళ్లీ కలుస్తాం
- అందుకోసం ఉద్యమకారులందరినీ పిలిచి మాట్లాడతాం
- ఉద్యమకారులకు న్యాయం చేయాలన్నదే తమ ప్రభుత్వ ఉద్దేశం
- నష్టపోయిన వారందరికీ న్యాయం చేస్తాం:మంత్రి పొన్నం
- ఉద్యమ జేఏసీలను కలుస్తాం: ఎమ్మెల్సీ కోదండరాం
- కె. కేశవరావు (కేకే)

2 లో..

తెలంగాణ ప్రత్యేక రాష్ట్ర సాధన కోసం జరిగిన ఉద్యమంలో ప్రత్యక్షంగా.. పరోక్షంగా పాల్గొన్న ఉద్యమకారులందరికి న్యాయం చేయాలన్నదే కాంగ్రెస్ ప్రభుత్వ ప్రధాన ఉద్దేశమని కె. కేశవరావు (కేకే) స్పష్టం చేశారు. తెలంగాణ ఉద్యమకారుల గుర్తింపు, గౌరవం కోసం కె. కేశవరావు అధ్యక్షతన ఏర్పాటైన కమిటీతో గురువారం హైదరాబాద్ సచివాలయంలో అఖిల పక్ష సమావేశం జరిగింది. ఈ సమావేశం అనంతరం కేకే మాట్లాడుతూ.. విద్యార్థులు, ఉద్యమకారుల సంఘాలను మళ్లీ కలుస్తామన్నారు. అందుకోసం ఉద్యమకారులందరినీ పిలిచి మాట్లాడతామని పేర్కొన్నారు. ఉద్యమకారులకు న్యాయం చేయాలన్నదే తమ ప్రభుత్వ ఉద్దేశమని తెలిపారు. ఉద్యమకారుల సంక్షేమం కోసం కమిటీ సమావేశం ఈరోజు జరిగిందని వివరించారు. ఈ అఖిల పక్షం సమావేశంలో అన్ని పార్టీల నేతలు పాల్గొన్నారని చెప్పారు. విద్యార్థులతో, ఉద్యమకారుల సంఘాలతో అనుబంధం ఉన్న వారిని మళ్లీ కలుస్తామని కె.కేశవరావు తెలిపారు. ఉద్యమకారులందరిని పిలిచి మాట్లాడుతామన్నారు. తెలంగాణ తొలి దశతోపాటు మలి దశ ఉద్యమకారులందరికీ న్యాయం చేయాలని రాష్ట్ర ప్రభుత్వం ఆలోచిస్తుందని పేర్కొన్నారు.



## తెలంగాణకు వ్యతిరేకంగా.. పవన్ ఎప్పుడూ మాట్లాడలేదు: రాంచందర్ రావు

2



ఏపీ డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ మీటింగ్‌కి అనుమతి ఇస్తే ఏమవుతుంది..? అని తెలంగాణ బీజేపీ అధ్యక్షుడు రాంచందర్ రావు ప్రశ్నించారు. తెలంగాణకు వ్యతిరేకం గా.. పవన్ ఎప్పుడూ మాట్లాడలేదని అన్నారు. ఈరోజు (గురువారం) హైదరాబాద్ వేదికగా రాంచందర్ రావు మీడియాతో మాట్లాడారు. తెలంగాణ సెంటిమెంట్‌ని మరోసారి రెచ్చ గొట్టే ప్రయత్నం చేస్తున్నారని దుయ్యబట్టారు.

## బాల్క సుమన్ మీద ఎందుకంత కోపం..

2 లో..

బాల్క సుమన్ మీద కాంగ్రెస్ ప్రభుత్వానికి ఎందుకంత కోపమని బిఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కల్వకుంట్ల కెటిఆర్ అన్నారు. వివాదాస్పద వ్యాఖ్యల కేసులో బిఆర్ఎస్ మాజీ ఎమ్మెల్యే బాల్క సుమన్ అరెస్టై చంచల్ గూడ జైలులో ఉన్నారు. ఈ క్రమంలో గురువారం ఉదయం బాల్క సుమన్ కలిసేందుకు కెటిఆర్.. చంచల్ గూడ జైలుకు వెళ్లారు.





2

## అలర్ట్.. అమీర్‌పేటలో అగ్నిప్రమాదం.. ట్రాఫిక్ ఆంక్షలు



2

## కువైట్ ఎయిర్ పోర్టుపై ఇరాన్ డ్రోన్ దాడి..ఒకరు మృతి, భారీగా ఆస్తి నష్టం

న్యూస్ వార్ వార్తా పత్రిక

సంపాదకీయం...

# పరీక్షలు.. ప్రహసనాలు

పరీక్షలు విద్యార్థి జీవితాన్ని మలుపు తిప్పేవి. దానిలో ఫలితాలే అతడి భవిష్యత్తును నిర్ణయిస్తాయి, నిర్దేశిస్తాయి. పరీక్షలు సమీపిస్తుంటే విద్యార్థులలో ఒత్తిడి చెప్పనలవి కాదు. ఈరోజుల్లో వారి తల్లిదండ్రులకు కూడా అంతే ఒత్తిడికి గురవుతున్నారు. ఎందుకంటే అందులో వారి కష్టం కూడా ఉంది. వారి ఆశలు, ఆకాంక్షలు తమ పిల్లల భవిష్యత్తు మీదనే ఆధారపడి ఉండటం ఇందుకు ప్రబల కారణం. కొన్ని రకాల కరికులంలలో ప్రతివారం పరీక్షలు జరుగుతూనే ఉంటాయి. అయినా సంవత్సరాంతపు పరీక్షలే విద్యార్థికి కీలకం. గతంలో ఏడాది పరీక్షలు పూర్తి కాగానే విద్యార్థులు తర్వాత వచ్చే సెలవులు ఆనందించేవారు. ఇప్పుడు ఆ పరిస్థితి లేదు. తదుపరి సంవత్సరపు సిలబస్ మరో రోజు నుండే మొదలు పెడుతున్నారు. లేదా ప్రవేశ పరీక్షలకై కోచింగ్ సెంటర్ల వెంట తిరిగి మళ్ళీ ఆ పరీక్షల ఫలితాలు, ర్యాంకులు ఈ విధంగా విద్యార్థికి నిత్యమూ ఒక పరీక్షే. పరీక్ష వారి జీవితంలో భాగమైపోయింది. పరీక్షల నిర్వహణ కూడా చాలా కీలకమైన ప్రక్రియ. ప్రశ్నాపత్రం తయారీ, ముద్రణ, పరీక్షా కేంద్రాలకు సరఫరా, పరీక్ష నిర్వహణ, మూల్యాంకనం, ఫలితాల ప్రకటన. ఇన్ని దశలతో కూడిన ఈ ప్రక్రియలో ఎక్కడ ఏమరుపాటుగా ఉన్నా, అజాగ్రత్త వహించినా దాని పర్యవసానాలు, పరిణామాలు చాలా తీవ్రంగా ఉంటాయి. అంటే పరీక్షలు విద్యార్థులకే కాదు అధికారులకు కూడా అనేది గమనార్హం. ఏదో విధంగా ప్రశ్న పత్రం లీక్ కావడం సర్వసాధారణమైపోయింది. యుజిసి నెట్ పరీక్షలు, యూనివర్సిటీ పరీక్షలు, ప్రవేశ పరీక్షలు, వార్షిక పరీక్షలు ఏదైనా సరే కాదేదీ లీకు కనర్హం. అందువల్ల పరీక్షల మీద నమ్మకం కోల్పోయే పరిస్థితులు దాపురించాయి. గతంలో ఏదైనా పరీక్షకు సంబంధించి ప్రశ్నాపత్రం లీక్ అయితే పరీక్ష తిరిగి నిర్వహించాల్సి వస్తే సంబంధిత మంత్రి రాజీనామా చేసేవాడు. ఇప్పుడు ఆ రోజులు పోయాయి. ముందుగా ప్రశ్నాపత్రం లీక్ కాలేదని దబాయింపు. తరువాత దానిని గెస్ పేపర్ అని బుకాయించడం అయినా గొడవ సద్దుమణగకపోతే పరీక్ష రద్దు తిరిగి నిర్వహణ అంతేకానీ నిందితులపై చర్యలు ఉండవు. తప్పుకు తమదే బాధ్యత అన్నంత మాత్రాన ఆ తప్పు ఒప్పు కాదు కదా. తిరిగి పరీక్ష నిర్వహించడం ఎంత శ్రమతో కూడిన పని. దానికి మళ్ళీ సిద్ధం కావడం విద్యార్థులపై ఎంత మానసిక ఒత్తిడి? ఎవరి స్వార్థం కోసం? ఎవరి నిర్లక్ష్యం వల్ల ఇంత అనవసరమైన ఖర్చు? అక్రమార్కులు ప్రతిచోట ఉంటారు. వ్యవస్థ వారికి లొంగిపోతే దానికున్న విశ్వసనీయత ఏమవుతుంది? పట్టు వదలని విక్రమార్కులను విజయం ఎప్పుడు వరిస్తుంది? బీహార్ రాష్ట్రంలో పరీక్షల నిర్వహణ గురించి కథలుగా చెప్పుకున్నారు తరువాత 'వ్యాపం' కుంభకోణం అది మధ్యప్రదేశ్‌కు చెందినదైనా దేశం మొత్తాన్ని కుదిపివేసింది. 13 దశల్లో అక్రమాలు జరగగా 2016 నుండి 100 మందికి పైగా దానికి సంబంధం ఉన్నవారు మరణించారు. అనేకమంది అరెస్టయ్యారు. 2025లో కూడా ఒకరు అరెస్ట్ అయినారు. ఇక ఐఐటి, జెఇఇ లాంటి ప్రతిష్టాత్మక వృత్తి విద్యా పరీక్షల నిర్వహణ కోసం నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ ఎన్‌టిఏ ఏర్పాటుచేసిన దాని పనితనం కూడా పేలవంగానే ఉంది. 2025లో మెయిన్స్ పరీక్షలో 19 ప్రశ్నలను తొలగించవలసి వచ్చింది. సరియైన సమాధానం లేకనో లేక ఎక్కువ సమాధానాలు ఉండడమో దానికి కారణం. అసలు ఆ పరీక్ష ప్రశ్నాపత్రం లీక్ అయినట్లు ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. 2026 ఏప్రిల్ మాసంలో జరిగిన మెయిన్స్ పరీక్షలో కూడా 12 ప్రశ్నలు తొలగించడం జరిగింది. సరియైన విధంగా ప్రశ్నాపత్రం రూపొందించబడలేదు. ఎంతో అనుభవం ఉన్న వారి చేతనే ఈ ప్రశ్నాపత్రం తయారు చేయబడుతుంది. దీనికి ఒక టీం ఉంటుంది. ప్రతి సబ్జెక్టుకు కనీసం ముగ్గురు తయారు చేస్తే అందులో ఒక దానిని నిపుణుల కమిటీ ఎంపిక చేయాలి. కానీ ఒకరే దానిని తయారు చేయడం, సరిగ్గా దానిని రూపొందించకపోవడం, అది లీక్ కావడం జరుగుతున్నాయి. మెడిసిన్ కోర్సుకు నిర్వహించే నీట్ యుజి జాతీయ ప్రవేశ పరీక్ష ప్రశ్నాపత్రం బీహార్ రాష్ట్రంలో లీక్ అయింది. సుప్రీంకోర్టు విచారణ అనంతరం కేవలం ఒక్క కేంద్రంలోనే పరీక్ష తిరిగి నిర్వహించబడింది. మొన్న మే నెల మూడవ తేదీన నిర్వహించబడిన నీట్ నిర్వహణపై మొదటి నుండి నీలినీడలు కమ్ముకున్నాయి. పేపర్ లీక్ అయిందని వార్తలు రాగా అవి అబద్ధమని కేవలం గెస్ పేపర్ చలామణిలోకి వచ్చిందని అందులో కొన్ని ప్రశ్నలు కలిసినట్లుగా సాక్షాత్తు మంత్రివర్యులు ఇంకా నీట్ నిర్వాహకులు సమర్థించుకున్నారు. కానీ బలమైన ఆధారాలు, ఆరోపణల మధ్య నీట్ నిర్వాహకులు ప్రవేశ పరీక్షను రద్దుచేసి తిరిగి జూన్ 21న నిర్వహిస్తామని ప్రకటించారు. దాదాపు 23 లక్షల మంది పోటీపడిన నీట్ యుజి ప్రవేశ పరీక్ష అసమర్థ నిర్వహణ ఆశావహులకు తీరని నిరాశనే మిగిల్చింది. ఊహాజనిత ప్రశ్నాపత్రం అయితే 720 మార్కులకు గాను 600 మార్కులకు సరిపోను ప్రశ్నలు కలుస్తాయా? ప్రశ్నాపత్రం తయారీదారులే లీకు వీరులుగా మారారని తెలుస్తోంది. వారు ఇంటి వద్ద ట్యూషన్లు చెప్పుకుంటూ ముఖ్యంగా కెమిస్ట్రీ, బయాలజీ ప్రొఫెసర్లు లక్షల రూపాయలకు ప్రశ్నాపత్రాన్ని అమ్ముకున్నట్లుగా విచారణలో వెల్లడయింది. ప్రశ్నాపత్రం ప్రతి సబ్జెక్టుకు ఒక్కరి చేతనే తయారు చేయించడం చాలా విడ్డూరంగా ఉంది. ఎన్‌టిఏ ఎందుకింత నిర్లక్ష్యంగా వ్యవహరించిందో అర్థం కావడం లేదు. రద్దుకు లేదా లీకుకు బాధ్యత మాదే అన్నంత మాత్రాన తప్పు ఒప్పు అవుతుందా? సుప్రీంకోర్టు సైతం కల్పించుకొని ఎన్‌టిఏను చివాట్లుపెడుతూ యుపిఎస్‌సిని చూసి నేర్చుకోమని వారు చాలా పకడ్బందీగా పరీక్షలు నిర్వహిస్తున్నారని పేర్కొనడం గమనార్హం. పరీక్షలు రాసిన 17 లక్షల మంది విద్యార్థులలో నాలుగు లక్షలకు పైబడి విద్యార్థులు తమ జవాబు పత్రాల స్కాన్ కాపీల కోసం దరఖాస్తు చేసుకోవడం పరిస్థితి తీవ్రతను తెలియజేస్తున్నది. చాలామంది విద్యార్థులు అవి అసలు జవాబు పత్రాలు కావని ఫిజిక్స్ అడిగితే కెమిస్ట్రీ జవాబు పత్రాలు లేదా కెమిస్ట్రీ బదులు ఫిజిక్స్ జవాబు పత్రాలు స్కాన్ కాపీలు ఇస్తున్నారని ఫిర్యాదు చేశారు. స్కాన్ కాపీల కోసం డబ్బు చెల్లించిన వారికి చెల్లించలేదని సమాధానం వస్తున్నదట. మొదటిసారిగా ఆన్ స్క్రీన్ మార్కింగ్ విధానం మొదలుపెట్టిన సిబిఎస్ఇ 12వ తరగతిలో అతి తక్కువ ఉత్తీర్ణత శాతం 85.2 నమోదు అయింది. బొమ్మలు మూల్యాంకనం చేయకపోవడం, ఖాళీ జవాబు పత్రాలు, స్కాన్ సరిగా జరగకపోవడం లాంటివి అనేక లోపాలు ఈసారి బయటపడ్డాయి. జెఇఇ టాప్ స్కోరర్స్‌కు కూడా 12వ తరగతిలో తక్కువ మార్కులు రావడం జరిగింది. చాలామంది విద్యార్థులు తమ జవాబు పత్రాల పేజీలు కొన్ని స్కాన్ కాపీలో కనబడడం లేదని ఆరోపిస్తున్నారు. సిబిఎస్ఇ విశ్వసనీయత ఈసారి చాలా దెబ్బతిన్నదనడంలో సందేహం లేదు. విద్యార్థులు మానసిక ఒత్తిడికి నిరాశ




నిస్పృహలకు గురవుతూ మార్కుల గురించి భవిష్యత్తు గురించి ఆందోళన చెందుతున్నారు. గతంలో తెలంగాణలో ఇంటర్ విద్యార్థుల జీవితాలతో ఆడుకున్న సంస్థ తమ పేరు మార్చుకొని ఈసారి సిబిఎస్ఇ 12వ తరగతి పరీక్షల ఒఎస్ఎమ్ మూల్యాంకనంలో టెండర్ సంపాదించి మళ్లీ అదే విధమైన తంతు కొనసాగించింది. మరిన్ని కనుగొనండి అంతర్జాతీయ వార్తలు జిల్లా వార్తలు జాతీయ వార్తలు పరీక్షల నిర్వహణ ఈ దేశంలో కొత్త ప్రక్రియ కాదు. దశాబ్దాలుగా సాగుతూనే ఉన్నది. అందుకోసం రాజ్యాంగబద్ధంగా ప్రత్యేక బోర్డులు, ఏజెన్సీలు ఏర్పాటు చేయబడ్డాయి. అనుభవజ్ఞులైన వారు సీనియర్లతో కూడిన కమిటీలు పర్యవేక్షిస్తుంటాయి. కానీ కొంతమంది అలసత్వం, కొందరి స్వార్థం ధనదాహం మూలంగా లక్షలాదిమంది విద్యార్థుల భవిష్యత్తు ప్రశ్నార్థకమవుతున్న పరిస్థితి చూస్తున్నాం. చివరకు భారత సర్వోన్నత న్యాయస్థానం కూడా కల్పించుకోవాల్సిన దుస్థితి ఏర్పడింది.

# బీజేపీకి సింగం అన్నామలై గుడ్‌బై!

## తదుపరి కొత్త పార్టీ ఏర్పాటుపై దృష్టి సొంత పార్టీతో ఉపఎన్నికల్లో పోటీ!!

**కోయంబత్తూరు,**

తమిళనాడు రాజకీయాల్లో సంచలన మార్పు చోటుచేసుకుంది. దేశవ్యాప్తంగా ఎంతో క్రేజ్ సంపాదించుకున్న ఐపీఎస్ మాజీ అధికారి, తమిళనాడు బీజేపీ మాజీ అధ్యక్షుడు కే. అన్నామలై ఆ పార్టీకి రాజీనామా చేశారు. ఢిల్లీలో బీజేపీ జాతీయ అధ్యక్షుడు నితిన్ నబీన్, జాతీయ ప్రధాన కార్యదర్శి బి.ఎల్. సంతోష్‌లను కలిసి తన 5 పేజీల రాజీనామా లేఖను సమర్పించారు. కొద్ది రోజులుగా అన్నామలై తదుపరి అడుగులపై సాగుతున్న ఉత్కంఠకు ఈ నిర్ణయంతో తెరపడింది. గత ఆరేళ్లుగా తమిళనాట బీజేపీకి 'స్టార్' ఇమేజ్ తెచ్చిన అన్నామలై, తాజాగా పార్టీ జాతీయ అధ్యక్షుడు నితిన్ నబీన్‌ను కలిసి రాజీనామా లేఖను అందజేశారు. ఐదు పేజీల సుదీర్ఘ లేఖలో ఆయన పార్టీ కేంద్ర నాయకత్వంతో తనకు ఉన్న వ్యూహాత్మక విభేదాలను స్పష్టంగా ప్రస్తావించినట్లు తమిళ మీడియా వర్గాలు చెబుతున్నాయి. ప్రత్యేకించి ఇటీవలి శాసనసభ ఎన్నికల్లో ఏఐఏడీఎంకే తో పొత్తు పెట్టుకోవాలన్న ఢిల్లీ పెద్దల నిర్ణయంపై ఆయన తీవ్ర అసంతృప్తితో ఉన్నారు. బీజేపీ స్వతంత్రంగా ఎదగాలని తాను కోరుకుంటే, అధిష్ఠానం మాత్రం ద్రావిడ పార్టీలపై ఆధారపడటాన్ని ఆయన జీర్ణించుకోలేకపోయారు.తమిళనాడు అసెంబ్లీ ఎన్నికల్లో అభ్యర్థుల ఎంపిక, సీట్ల కేటాయింపులో అన్నామలై అభిప్రాయాలను కేంద్ర నాయకత్వం పక్కన పెట్టింది. తనకు కేవలం ఆరు స్థానాల బాధ్యతలు మాత్రమే అప్పగించడంపై ఆయన తీవ్ర అసంతృప్తి చెందారు. ఫలితంగా జరిగిన ఎన్నికల్లో బీజేపీ కేవలం ఒక్క స్థానానికే పరిమితం కావడం, పార్టీ ఘోర పరాజయం పాలుకావడంతో అన్నామలై వాదన నిజమైంది. బీజేపీలో తనకు తగినంత స్వేచ్ఛ, భవిష్యత్తు లేవని భావించిన ఆయన, సుదీర్ఘ చర్చల అనంతరం కమలం గూటి నుంచి బయటకు రావడమే ఉత్తమమని భావించారు.అన్నామలై రాజకీయాల నుంచి తప్పుకోవడం లేదు, పైగా మరింత దూకుడు పెంచబోతున్నారు. రాబోయే ఉపఎన్నికల్లో స్వతంత్ర అభ్యర్థిగా లేదా సరికొత్త వేదిక ద్వారా పోటీ చేసేందుకు ఆయన సన్నాహాలు చేసుకుంటున్నారు. రాబోయే 6 నుంచి 8 నెలల కాలంలో ఒక కొత్త ప్రాంతీయ పార్టీని స్థాపించే యోచనలో ఆయన ఉన్నారు. తమిళ అస్థిత్వం - జాతీయ దృక్పథం అనే సరికొత్త స్లోగన్‌తో, ఒక సెక్యులర్ ప్లాట్‌ఫామ్‌ను సిద్ధం చేయడమే ఆయన తదుపరి కార్యాచరణగా తెలుస్తోంది. ప్రముఖ నటుడు విజయ్ రాజకీయ అరంగేట్రం చేసి ఘనవిజయం సాధించడంతో తమిళనాడు రాజకీయ సమీకరణాలు పూర్తిగా మారిపోయాయి. ద్రావిడ పార్టీలైన డీఎంకే, ఏఐఏడీఎంకే , బీజేపీలకు ప్రత్యామ్నాయంగా ఒక కొత్త శక్తి వైపు యువత మొగ్గు చూపుతోందని అన్నామలై గమనించారు. బీజేపీ సిద్ధాంతాల ముద్ర వల్ల తమిళనాడులో ఎదగడం కష్టమని గ్రహించిన ఆయన, విజయ్ తరహాలోనే ద్రావిడ సంస్కృతి, అవినీతి రహిత పాలన అజెండాతో యువతను ఆకట్టుకోవాలని చూస్తున్నారు. ఇప్పటికే పలువురు యువ నిపుణులు, అసంతృప్త నేతలు ఆయనతో టచ్‌లోకి వెళ్లినట్లు సమాచారం.

తమిళనాడు బీజేపీకి అన్నామలై రాజీనామా చేయడం ఆ పార్టీకి కోలుకోలేని దెబ్బే. ఐపీఎస్ ఉద్యోగాన్ని వదిలి రాజకీయాల్లోకి వచ్చిన ఈ యువనేత, ఇప్పుడు బీజేపీ చట్రం నుంచి బయటకు వచ్చి ఒంటరి పోరాటానికి సిద్ధమయ్యారు. కోయంబత్తూరుతో సహా తమిళనాడు అంతటా ఆయన మద్దతుదారులు ఇప్పటికే అన్నామలై 2.0 పోస్టర్లతో హల్‌చల్ చేస్తున్నారు. మరి ఈ సింగం సొంతంగా పార్టీ పెట్టి ద్రావిడ కోటలను బద్దలు కొడుతుందో లేదో చూడాలి.



# రోడ్ల డ్యామేజీ గుర్తింపును డిజిటల్ డ్యాష్ బోర్డు

## రహదారుల నాణ్యత పెంచేలా ఆధునిక టోక్నాలజీ

## మంత్రి బీసీ జనార్దన్ రెడ్డి వెల్లడి

**అమరావతి,**

రాష్ట్రంలో మౌలిక వసతుల అభివృద్ధికి ప్రభుత్వం ప్రాధాన్యం ఇస్తోందని మంత్రి బీసీ జనార్దన్ రెడ్డి తెలిపారు. పెండింగ్‌లో ఉన్న రహదారి ప్రాజెక్టులను వేగంగా పూర్తి చేస్తున్నామన్నారు. రోడ్ల డ్యామేజ్ గుర్తింపునకు డిజిటల్ డ్యాష్‌బోర్డ్ వ్యవస్థను అందుబాటులోకి తీసుకొస్తామన్నారు. రహదారుల నాణ్యత పెంచేందుకు ఆధునిక టెక్నాలజీని వినియోగిస్తున్నట్లు తెలిపారు. నాలుగేళు మన్నే రోడ్లు 7-8 ఏళ్లు నిలిచేలా చర్యలు తీసుకుంటున్నట్లు చెప్పారు. నాణ్యతా ప్రమాణాలతో పాటు కొత్త టెక్నాలజీతో రోడ్లు వేస్తూ మెయింటెనెన్స్ బాధ్యత కూడా కాంట్రాక్టు సంస్థలు తీసుకునేలా చేశామని మంత్రి బీసీ జనార్దన్ రెడ్డి వెల్లడించారు. విశాఖ, కృష్ణా, గుంటూరు జిల్లాల్లో అభివృద్ధి పనులపై ప్రత్యేక దృష్టి సారించినట్లు చెప్పారు. బుధవారం మీడియాతో మాట్లాడుతూ.. రూ.750 కోట్లతో రోడ్ల అభివృద్ధి పనులు చేపట్టామన్నారు.13 అసంపూర్ణ వంతెనలను పూర్తిచేసేందుకు ప్రత్యేక నిధులు సిద్ధంగా ఉన్నాయన్నారు. రాష్ట్రంలో పిపిపి మోడల్‌లో భారీ రహదారి ప్రాజెక్టులు అమలు చేస్తున్నామన్నారు. 405 కి.మీ మేర రూ.2506 కోట్లతో పీపీపీ విధానంలో 6 ప్రాజెక్టులు చేపట్టినట్లు చెప్పారు. ట్రాఫిక్ సమస్యల పరిష్కారానికి ఆధునిక ప్రణాళికలు రూపొందించినట్లు మంత్రి వెల్లడించారు. జాతీయ రహదారుల విస్తరణలో ఏపీ.. దేశంలో ముందంజలో ఉందన్నారు. రాష్ట్రంలో వేల కిలోమీటర్ల జాతీయ రహదారుల అభివృద్ధి జరుగుతోందన్నారు. మహారాష్ట్ర, ఉత్తర్‌ప్రదేశ్ తర్వాత అత్యధిక రహదారి పనులు ఏపీలోనే జరుగుతున్నాయని తెలిపారు. రూ.7,784 కోట్లతో కొత్త రహదారి ప్రాజెక్టులు అమలు చేస్తున్నామని.. మరో రూ.30,780 కోట్ల విలువైన ప్రాజెక్టులు ప్రగతిలో ఉన్నాయని అన్నారు. రూ.18 వేల కోట్లతో 79 కొత్త ప్రాజెక్టులకు సిద్ధం అవుతున్నామన్నారు. పెండింగ్ రైల్వే ప్రాజెక్టులపై సీఎం చంద్రబాబు నాయుడు నిరంతరం సమీక్ష చేస్తున్నట్లు తెలిపారు. ఢాష్ట్రంలో ఏ ప్రాజెక్టు ఆగిపోకుండా చర్యలు తీసుకుంటున్నామని బీసీ జనార్దన్ అన్నారు. కుప్పం, శ్రీకాకుళం, అమరావతి సహా నాలుగు విమామాశ్రయాలు కొత్తగా తీసుకొస్తున్నామని తెలిపారు. పోర్టుల అభివృద్ధితో రాష్టానికి పెట్టుబడులు పెరుగుతున్నాయన్నారు. పరిశ్రమలకు అనుకూల వాతావరణం కల్పిస్తున్నామని చెప్పారు. మౌలిక సదుపాయాల అభివృద్ధితో రాష్ట్ర ప్రగతే ప్రభుత్వ లక్ష్యమని స్పష్టం చేశారు. గత 5 ఏళ్ల విధ్వంస పాలన వల్ల రాష్ట్రంలో రోడ్లు వేసేందుకు కూడా కాంట్రాక్టర్లు ముందుకు రాని పరిస్థితి ఉండేదని వ్యాఖ్యానించారు. పనులు లేక బిల్లులు చెల్లించక కాంట్రాక్టర్లు ఆత్మహత్యలు చేసుకునేలా గత ప్రభుత్వం వ్యవహరించిందని విమర్శించారు. మళ్లీ వస్తే అదే అరాచకం చేస్తామంటూ గొడ్డలి పార్టీ మాట్లాడుతోందని మండిపడ్డారు. గత రెండేళ్లలో రూ.3 వేల కోట్ల నిధులు మంజూరు చేసి అభివృద్ధి పనులు చేపట్టామన్నారు. పెండింగ్ రహదారుల పనులు ప్రారంభించటంతో పాటు నిరంతరం పర్యవేక్షిస్తున్నామని చెప్పారు. రూ.439 కోట్లతో 400 కిలోమీటర్ల మేర గోదావరి పుష్కర పనులు చేపట్టామన్నారు.



# రాజధానిపై జగన్ నిత్య అసంతృప్తి

## ఓసారి మూడు రాజధానుల ప్రకటన

## ఇప్పుడేమో మావిగాన్ అంటూ కొత్త గానం

## జగన్ వ్యాఖ్యలు పిల్లలకు కూడా విసుగెత్తేలా ఉన్నాయి

## రాజధాని నిర్మాణ పనులను పరిశీలించిన మంత్రి నారాయణ

**అమరావతి,**

వైసీపీ అధినేత వైఎస్ జగన్ మోహన్ రెడ్డి.. మావిగాన్ వ్యాఖ్యలపై మంత్రి నారాయణ తీవ్ర స్థాయిలో మండిపడ్డారు. జగన్ మావిగాన్ వ్యాఖ్యల పట్ల చిన్న పిల్లలు కూడా నవ్వుకుంటున్నారన్నారు. ఒకారి మూడు రాజధానులు, ఇప్పుడేమో మావిగాన్ అంటూ జగన్ చేస్తున్న వ్యాఖ్యలు దుర్మార్గం అన్నారు. జగన్ బాధ్యతారాహిత్యంగా మాట్లాడుతున్నారని వ్యాఖ్యానించారు.రాజధాని ప్రాంతంలో మంత్రి నారాయణ బుధవారం పర్యటించారు. ఈ సందర్భంగా కొండవీటి వాగు, పాలవాగు ప్రవాహ మార్గాలను, పెనుమాక రిజర్వాయర్‌ను పరిశీలించారు. రాజధాని రోడ్డుల నిర్మాణం జరుగుతున్న ప్రాంతాలలో వాగుల ప్రవాహానికి ఆటంకాలు లేకుండా చూడాలని అధికారులకు ఆదేశాలు ఇచ్చారు. నిర్మాణం జరుగుతున్న వంతెనల క్రింది భాగంలో మట్టి పూడిక తీతలు త్వరగా తొలగించాలని ఆదేశించారు. తెలంగాణకు వచ్చే ఆదాయం హైదరాబాద్ నుంచి వస్తుందని.. అమరావతి ఆదాయం అన్ని జిల్లాలకు పంచుతారని మంత్రి తెలిపారు. ముఖ్యమంత్రి అంటే విజన్ ఉండాలని.. జగన్‌కు లేదంటూ వ్యాఖ్యానించారు. రైతులను ల్యాండ్ పూలింగ్‌కు రావాలని మరోసారి కోరుతున్నట్లు తెలిపారు. రైతుల దగ్గర బలవంతంగా తీసుకోకూడదనే ఇప్పటి వరకు ల్యాండ్ అక్విజేషన్‌కు వెళ్లలేదన్నారు. 2028 ఆగస్టు నాటికి రాజధాని దాదాపు సిద్ధం అవుతుందని స్పష్టం చేశారు. నేటికి నయా రాయపూర్ నిర్మాణాలు జరుగుతున్నాయన్నారు. జగన్ డేటా తీసుకుని మాట్లాడాలని హితవుపలికారు. అమరావతిలో పనులు వేగంగా జరుగుతున్నాయని మంత్రి తెలిపారు. వర్షాకాలం వచ్చేలోగా ఎలాంటి ఇబ్బంది లేకుండా చూస్తున్నామన్నారు. గత వర్షాకాలం పశ్చిమ బైపాస్ కింద వాగులు పూడిపోవడంతో వాటర్ వెనక్కి తన్నిందని.. వెస్టర్న్ బైపాస్ దగ్గర 2 బ్రిడ్జి పనులు జరుగుతుండగా మరో 69 బ్రిడ్జిల నిర్మాణం జరుగుతాయన్నారు. వెస్టర్న్ బైపాస్ వద్ద వెంట్స్‌ను పదిరోజుల్లో క్లియర్ చేస్తామని చెప్పారు. అమరావతి వాటర్ ఎ÷-లో కోసం నెదర్లాండ్స్ వాళ్లతో మాట్లాడి డిజైన్ చేశామన్నారు. పనులు జరుగుతున్నప్పుడు



కొన్ని ఇబ్బందులు ఉంటాయని వెల్లడించారు. జూన్, జులై, ఆగస్టు, సెప్టెంబర్ వరకు మాత్రమే ఇబ్బందులు ఉంటాయని.. తరువాత 69 బ్రిడ్జిలు పూర్తి అవుతాయని తెలిపారు. 200 సంవత్సరాల చరిత్ర తీసుకొని గ్రావిటీ కెనాల్‌లను ఏర్పాటు చేసినట్లు నారాయణ తెలిపారు. గత సంవత్సరం వెస్టర్న్ బైపాస్‌ను కడుతూ ప్రవాహం పూడ్చేశారని.. దీంతో అక్కడ పూడిక ఏర్పడిందన్నారు. ఈసారి అలాంటి సమస్య లేకుండా చూస్తామని తెలిపారు. 494 ఎకరాలకు మాత్రమే ఇంకా ఎ÷-లాట్‌లు కేటాయించలేదని.. అక్కడ న్యాయపరమైన చిక్కులు, వారసత్వ ఇబ్బందులు ఉన్నాయన్నారు. లాటరీకి సిద్ధంగా 144 ఎకరాలు 74 మంది రైతులు ఉన్నారని తెలిపారు. ఇప్పటి వరకు 35,057 ఎకరాలు తీసుకున్నామని.. ఇందులో రిటర్నబుల్ ఎ÷-లాట్‌లు ఇవాల్సింది 498 ఎకరాలు మాత్రమే అని మంత్రి నారాయణ వెల్లడించారు.

న్యూస్ వార్
వార్తా పత్రిక

## పిఆర్ టియు రాష్ట్ర అకడమిక్ గైడెన్స్ కమిటీ వైస్ చైర్మన్‌గా నక్క యుగంధర్

నాంపల్లి మే 04 (న్యూస్ వార్ )



నాంపల్లి మండల కేంద్రానికి చెందిన నక్క యుగంధర్, ఎస్ ఏ (ఫిజికల్ సైన్స్), జడ్.పి.హెచ్.ఎస్ పస్నూర్ పిఆర్ టియు తెలంగాణ రాష్ట్ర అకడమిక్ గైడెన్స్ కమిటీ వైస్ చైర్మన్‌గా నియమిస్తూ రాష్ట్ర కమిటీ ఉత్తర్వులు జారీ చేసింది. ఈ మేరకు రాష్ట్ర అధ్యక్షుడు పుల్గం దామోదర్ రెడ్డి మరియు ప్రధాన కార్యదర్శి సుంకరి బిక్షం గౌడ్ సంయుక్తంగా నియామక పత్రాన్ని విడుదల చేశారు. విద్యా రంగంలో విశేష సేవలు అందిస్తున్న నక్క యుగంధర్ కు ఈ బాధ్యతలు అప్పగించడంపై ఉపాధ్యాయులు, మిత్రులు, గ్రామస్థులు హర్షం వ్యక్తం చేస్తూ అభినందనలు తెలిపారు.

## మర్రిగూడ పీఎం శ్రీ మోడల్ స్కూల్లో అడ్మిషన్లు ప్రారంభం



మర్రిగూడ మే 4 (న్యూస్ వార్ )

పీఎం శ్రీ తెలంగాణ మోడల్ స్కూల్ లో 2026--27 విద్యా సంవత్సరానికి గాను 6వ తరగతి నుండి 10వ తరగతి వరకు ప్రవేశాల కోసం ఆఫ్లైన్ దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు పాఠశాల ప్రిన్సిపాల్ ఉయ్యాల వెంకటేశం తెలిపారు. ఆసక్తి గల విద్యార్థులు మరియు వారి తల్లిదండ్రులు అవసరమైన ధృవపత్రాలతో పాఠశాల కార్యాలయాన్ని సంప్రదించి ప్రవేశాలకు దరఖాస్తు చేసుకోవచ్చన్నారు. ఆఫ్లైన్ ప్రవేశాలకు చివరి తేదీ 08 జూన్ 2026గా నిర్ణయించినట్లు తెలిపారు. నాణ్యమైన విద్యతో పాటు విద్యార్థుల సమగ్ర అభివృద్ధికి పాఠశాలలో ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటున్నామని, ఈ అవకాశాన్ని విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని ప్రిన్సిపాల్ కోరారు..

## బ్యాటరీల దొంగ తనాలకు పాలు పడుతున్న దొంగల అరెస్టు

రూరల్ ధరుర్ గ్రామ శివారులో రూరల్ ఎస్సై ఉమాసాగర్ పోలీసులు తనిఖీలు చేస్తున్న సమయంలో ఆటోలో బ్యాటరీలు ముగ్గురు వ్యక్తులు అనుమాన స్పందన కనిపించగా వారిని అరెస్టు చేసి పోలీస్ స్టేషన్లకు తరలించి నిందితుల వద్ద నుండి 39 బాటరీ లు, 4 ఖూలా లు, ఒక ఆటో స్వాధీనం చేసుకున్నారు. వీటి విలువ 4,52000 రూపాయలు ఉంటుందని తెలిపారు వీరు జగిత్యాల రూరల్ మండలం లక్ష్మీపురం గ్రామానికి చెందిన బండి అంజయ్య, మండలి రవి, చేమల్ల నరేష్ అనే ముగ్గురు నిందితులను గురువారం అరెస్టు చేసి నిందితులను రిమాండ్ కు పంపనున్నట్లు రూరల్ సీఐ సుధాకర్ తెలిపారు.

## రేపు అక్కన్నపేట నగర్ వన్ యోజన పార్కులో ప్రపంచ పర్యావరణ దినోత్సవ వేడుకలు....

**అటవీ శాఖ ఆధ్వర్యంలో**

**'ప్రజాపాలన ప్రగతి ప్రణాళిక' కార్యాచరణ...**

**- ముఖ్య అతిథులుగా జిల్లా కలెక్టర్ ప్రతిమా సింగ్ ప్రజాప్రతినిధులు, అధికారులు హాజరుకానున్నారు....**

తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన 'ప్రజాపాలన ప్రగతి ప్రణాళిక' లో భాగంగా మెదక్ జిల్లాలో ప్రపంచ పర్యావరణ దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించనున్నారు. అటవీ శాఖ ఆధ్వర్యంలో జూన్ 1 నుండి జూన్ 12 వరకు ప్రత్యేక పర్యావరణ ఇతివృత్త కార్యాచరణ ప్రణాళికను రూపొందించారు. ఇందులో భాగంగా జూన్ 5 (రేపు) ఉదయం 9:30 గంటలకు మెదక్ జిల్లాలోని అక్కన్నపేట నగర్ వన్ యోజన పార్క్ వేదికగా ఈ ప్రపంచ పర్యావరణ దినోత్సవ వేడుకలు జరగనున్నాయి. ఈ పర్యావరణ మహోత్సవానికి జిల్లాలోని ప్రముఖ ప్రజాప్రతినిధులు, ఉన్నతాధికారులు ముఖ్య అతిథులుగా హాజరుకానున్నారు. పర్యావరణ పరిరక్షణ, అడవుల విస్తరణ, మరియు ప్రకృతి సమతుల్యతను కాపాడటంపై ఈ సందర్భంగా ప్రత్యేక అవగాహన కార్యక్రమాలు మరియు మొక్కలు నాటే కార్యక్రమాలను చేపట్టనున్నారనీ,మెదక్ జిల్లా అటవీ శాఖ అధికారి జోజి గురువారం ఒక ప్రకటనలో కోరారు.



# బడి బాట సమర్ధవంతంగా నిర్వహించాలి...

**- ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థుల నమోదు శాతాన్ని పెంచాలి.....**

**- జిల్లా కలెక్టర్ ప్రతిమాసింగ్.....**



ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థుల నమోదు శాతాన్ని పెంచాలని జిల్లా కలెక్టర్ ప్రతిమా సింగ్ అధికారులకు ఆదేశించారు.గురువారం కలెక్టరేట్ లోని మీటింగ్ హాల్లో విద్యాధికారులతో సమీక్షించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ ప్రతిమా సింగ్ మాట్లాడుతూ ఈ విద్యా సంవత్సరం మెరుగైన విద్యా ప్రమాణాల లక్ష్యంగా ముందుకు పోతూ బడి బాట సమర్ధవంతంగా నిర్వహించాలని,విద్యార్థుల తక్కువ నమోదు పాఠశాలలపై ప్రత్యేక దృష్టి సారించాలని, విద్యార్థుల నమోదు పెంచుటకై గ్రామంలోని ప్రతి ఒక్కరిని భాగస్వాములు చేయాలని, కనీస సామర్థ్యాలు అయినటువంటి చదవడం రాయడంపై ప్రత్యేక దృష్టి పెట్టాలని, పాఠశాలల్లో ఏర్పాటు చేసే మౌలిక వసతుల గురించి తల్లిదండ్రులకు వివరించాలని, వీటి ఆధారంగానే పాఠశాలలకు ప్రగతి సూచికలు ఇవ్వబడతాయని ,రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ప్రారంభించిన ప్రీ ప్రైమరీ పాఠశాలలపై ప్రత్యేక చర్యలు తీసుకోవాలని అలాగే ఎఫ్ఆర్ఎస్, ఇతర అంశాలపై దృష్టి పెట్టి సరియగు చర్యలు గైకొనాలని సూచించారు ,జిల్లాలోని భవిత కేంద్రాల బలోపేతానికి కృషి చేయాలని, కొత్త ప్రీ ప్రైమరీ విభాగాలను ప్రారంభించాలని, విద్యార్థుల సంఖ్యలేని పాఠశాలలను తిరిగి ప్రారంభించాలని, పాఠ్యపుస్తకాల పంపిణీ చేయాలని, స్వయం సహాయక బృందాల చేత పిల్లలకు యూనిఫామ్ కుట్టించాలని, నూతన టెక్నాలజీ ఏఐ, డిజిటల్ తరగతులను నిర్వహించాలని, విద్యాశాఖ బలోపేతానికి ప్రత్యేక కార్యచరణ ప్రకారం ముందుకు సాగాలని జిల్లా కలెక్టర్ సంబంధిత అధికారులకు ఆదేశించారు. ఈ కార్యక్రమంలో జిల్లా విద్యాధికారి రాజు, చీఫ్ మానిటరింగ్ ఆఫీసర్ రాజు, ఏ ఎం ఓ సుదర్శన మూర్తి, నవీన్, తదితరులు పాల్గొన్నారు.

# ముఖ్యమంత్రి జిల్లా పర్యటన విజయవంతం

**గుడ్డెం దొడ్డి పంపుహౌస్ ను పరిశీలించిన ముఖ్యమంత్రి.**

**జిల్లా ప్రాజెక్టులపై ఫోటో ఎగ్జిబిషన్, పీపిటి ప్రజెంటేషన్.**

**సీఎం పర్యటనకు భారీ బందోబస్తు.**



జూరాల ప్రాజెక్టు బ్యాక్ వాటర్ ద్వారా చేపట్టిన జవహర్ నెట్టెంపాడు ఎత్తిపోతల పథకంలో భాగంగా నిర్మించిన గుడ్డెం దొడ్డి జలాశయం సామర్థ్యాన్ని 11 లేదా15 టీఎంసీలకు పెంచాలని స్థానిక ప్రజా ప్రతినిధులు, ఇరిగేషన్ శాఖ అధికారుల ప్రతిపాదనల నేపథ్యంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి గురువారం పంపు హౌస్ ను సందర్శించారు. ఈ సందర్భంగా ఇరిగేషన్ అధికారులు ముఖ్యమంత్రికి జిల్లాకు అవసరమైన నీటి వనరుల సామర్థ్యం పెంపునకు అవసరమైన ప్రతిపాదనలను వివరించారు. ముఖ్యంగా గూడెం దొడ్డి ప్రాజెక్టు 15 టిఎంసిలకు పెంచడం, ర్యాలంపాడు సీపేజీ సమస్యను పరిష్కరించి నాలుగు టీఎంసీల నీటి స్టోరేజ్ నిలువ చేసే విధంగా చర్యలు చేపట్టాల్సి ఉందని అలాగే మల్లమ్మ కుంట భూసేకరణ పనులను చేపట్టాల్సిందని తెలియజేశారు. ఈ సందర్భంగా ధరూర్ మండలంలోని గుడ్డెం దొడ్డి రిజర్వాయర్ వద్ద ఏర్పాటు చేసిన హెలిపాడ్ వద్ద గురువారం సాయంత్రం 4:30 ప్రాంతంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, మంత్రులకు జిల్లా కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్, ఎస్పీ శ్రీనివాసరావు, గద్వాల శాసనసభ్యులు బండ్ల కృష్ణమోహన్ రెడ్డి, తదితరులు బొకేలు, మొక్కలు అందజేసి ఘనంగా స్వాగతం పలికారు. అక్కడి నుంచి సీఎం రోడ్డు మార్గంలో జవహర్ నెట్టెంపాడు లిఫ్ట్ ఇరిగేషన్ ప్రాజెక్టులో భాగంగా నిర్మించిన స్టేజ్1 గుడ్డెం దొడ్డి పంపు హౌస్ వద్దకు చేరుకొని మంత్రులతో కలిసి జోగులాంబ గద్వాల జిల్లాలోని నీటి పారుదల ప్రాజెక్టులపై పిపిటి ద్వారా సమీక్ష నిర్వహించారు. అంతకుముందు జిల్లా ప్రాజెక్టుల గురించి ఏర్పాటు చేసిన ఫోటో ఎగ్జిబిషన్ ను తిలకించారు. అనంతరం తిరిగి వెళ్లే సమయంలో సీఎం కాంగ్రెస్ పార్టీ నేతలు, కార్యకర్తలు, అభిమానులకు, మీడియా ప్రతినిధులకు అభివాదం చేస్తూ కరచాలనం చేశారు. ఈ సందర్భంగా అభిమానులు సీఎంకు పుష్పగుచ్చాలు, శాలువాలు, జ్ఞాపికలు అందజేశారు. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పటిష్ట భద్రత చర్యలతో పాటు, పకడ్బందీ ఏర్పాట్లు చేసి స్థానిక ప్రజాప్రతినిధులు, సంబంధిత శాఖల అధికారుల సహకారం, సమన్వయంతో ముఖ్యమంత్రి పర్యటనను విజయవంతం చేసినట్లు గద్వాల శాసనసభ్యులు బండ్ల కృష్ణమోహన్ రెడ్డి, జిల్లా కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్, ఎస్పీ శ్రీనివాసరావు తెలిపారు. ఈ కార్యక్రమంలో నీటి పారుదల శాఖ మంత్రి ఉత్తంకుమార్ రెడ్డి, పశు సంవర్ధక, మత్స్య శాఖ మంత్రి వాకిటి శ్రీహరి, కర్నాటక మంత్రి బోసురాజు, గద్వాల, అలంపూర్ శాసనసభ్యులు బండ్ల కృష్ణమోహన్ రెడ్డి, విజయుడు, రాష్ట్ర వాల్మీకి అభివృద్ధి కార్పొరేషన్ చైర్మన్ గట్టు తిమ్మప్ప, గొర్రెలు, మేకలు అభివృద్ధి కార్పొరేషన్ చైర్ పర్సన్ సరిత, అదనపు కలెక్టర్ మధుమోహన్, ఆర్డీవో శ్రీనివాసరావు, మాజీ ఎమ్మెల్యే సంపత్ కుమార్, డీసీసీ అధ్యక్షుడు రాజీవ్ రెడ్డి, ఇరిగేషన్ శాఖ సీఈ రహీముద్దీన్, ఇతర ప్రజాప్రతినిధులు, అధికారులు, నేతలు, తదితరులు పాల్గొన్నారు.

# కొడంగల్ ఎత్తిపోతల ద్వారా లక్ష ఎకరాలకు సాగునీరు

**ప్రాజెక్టు పనుల పురోగతిపై ముఖ్యమంత్రి రేవంత్ పరిశీలన**

**త్వరగా పనులు పూర్తి చేయాలని అధికారులకు ఆదేశం**

నారాయణపేట,

మక్తల్ నారాయణపేట కొడంగల్ ఎత్తిపోతల పథకం ద్వారా లక్ష ఎకరాలకు సాగునీరు అందుతుందని రాష్ట్ర ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డి తెలిపారు. బీమా కృష్ణా నదులపై నిర్మించనున్న ప్రాజెక్టు పనుల పురోగతిపై గురువారం ముఖ్యమంత్రి బెంగుళూరు నుంచి నేరుగా మక్తల్ చేరుకోగా ఉత్తమ్ కుమార్ రెడ్డి, దామోదర రాజనర్సింహ, జూపల్లి కృష్ణారావు, వాకిటి శ్రీహరిలకు జిల్లా కలెక్టర్ సిహెచ్ ప్రియాంక ఘన స్వాగతం పలికారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన ఇరిగేషన్ ప్రాజెక్టులపై ఫోటో గ్యాలరీని ముఖ్యమంత్రి వీక్షించారు. మక్తల్ నారాయణపేట కొడంగల్ ఎత్తిపోతల పథకం భీమా కృష్ణా నదులపై ప్రతిపాద బ్యారేజీ పనులు పురోగతికి సంబంధించిన ఫోటో ఎగ్జిబిషన్ ప్లాన్ మ్యాప్స్ ద్వారా ముఖ్యమంత్రికి వివరించిన ఇరిగేషన్ అధికారులు. ÷రాష్ట్ర ముఖ్యమంత్రి ఏ. రేవంత్ రెడ్డి మక్తల్ మండలం కాట్రేవు పల్లి గ్రామ సమీపంలో కొనసాగుతున్న మక్తల్ నారాయణ పేట కొడంగల్ ఎత్తిపోతల ప్యాకేజ్ -1 పనులను గురువారం పరిశీలించారు. ప్యాకేజ్ -1 లో భాగంగా జరుగుతున్న పంప్ హౌస్ పనులు ఎంత శాతం పూర్తయ్యాయని అధికారులను అడిగి తెలుసుకున్నారు. కాంక్రీటు పనులను ప్రారంభించి వేగంగా పూర్తి చేయాలని ఆదేశించారు. కార్యక్రమంలో రాష్ట్ర నీటి పారుదల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి, కర్ణాటక రాష్ట్ర నీటిపారుదల శాఖ మంత్రి బోసు రాజు, జిల్లా మంత్రులు జూపల్లి కృష్ణారావు, డాక్టర్ వాకిటి శ్రీహరి, కలెక్టర్ సీ హెచ్ ప్రియాంక, ఇరిగేషన్ కార్యదర్శి శ్రీదర్, చీఫ్ ఇంజనీరు. ఏ సత్య నారాయణ రెడ్డి, సూపరింటెండెంట్ ఇంజనీర్ హెచ్.టి శ్రీధర్, ఉన్నారు.



Edited, Printed, Published & Owned by NATAVA KRISHNA RAO, Published from: Krishna Publications, 10-74, Main Road, Chandoor, (Post &Mandal) Nalgonda 508 255, Telangana, Printed at: Krishna Publications, 10-74, Main Road, Chandoor, (Post &Mandal) Nalgonda 508 255,Telangana, Editor:NATAVA KRISHNA RAO, Cell: 9440991979,